కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో.. టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 8, క్యారెట్ 24, దొండ 35, గుండు బీన్స్ 145, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 28, దోసకాయ 23, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 26, చామగడ్డ 35.

సమ్మె కాలానికి వేతనం చెల్లించండి

ఉస్మానియా యూనివర్సిటీ: సమ్మె కాలానికి వేతనం చెల్లించాలని కాంట్రాక్టు అధ్యాపకుల నాయకుడు డా.సీమర్ల విజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంట్రాక్టు అధ్యాపకుల పర్మనెంట్, ఉద్యోగ భద్రత, యూజీసీ పే స్కేల్ తదితర డిమాండ్ల పై గత నెల 13 రోజులు చేపట్టిన నిరవధిక సమ్మె కాలానికి వేతన చెల్లింపులో కోత విధించడం తగదన్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల డిమాండ్ల పై సీఎం రేవంత్ రెడ్డి స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చాకే సమ్మెను విరమించామన్నారు.

ఎర్రకుంట చెరువు వద్ద హైడ్రామా..

చెరువు భూముల్లో గుడిసెలు వేసేందుకు యత్నం

లాలాపేట: తార్నాక ఎర్రకుంట చెరువులో గుడిసెలు వేసేందుకు యత్నించిన వారిని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అడ్డుకున్నారు. కొందరిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనలతో శనివారం తార్నాక ఎర్రకుంట చెరువు వద్ద హైడ్రామా కొనసాగింది. దీంతో స్థానిక కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉదయం నుంచి దాదాపు వంద మందికి పైగా గుర్తు తెలియని వ్యక్తులు చెరువు భూముల్లో గుడిసెలు వేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు ఇటువైపు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలో ఫోన్‌లో మాట్లాడారు. పీఎస్‌లో అధికారుల ఫిర్యాదు మారెడుపల్లి తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులు తార్నాక ఎర్రకుంట చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. చెరువు భూములను అక్రమించేందుకు యత్నించిన వారిపై ఓయూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



తార్నాక ఎర్రకుంట చెరువును పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ ఎం. శ్రీలతాశోభన్‌రెడ్డి

నేడు జీవై కంపౌండ్ బస్తీ ఎన్నికలు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ జీవై కంపౌండ్ బస్తీ ఎన్నికలు ఈ నెల 11 ఆదివారం జరగనున్నాయి. బస్తీలో 153 కుటుంబాలు ఓటు హక్కును వినియోగించుకోనున్నాయి. బరిలో బస్తీ నాయకులు వెంకటబాబు, కుమార్ యాదవ్‌లు అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్నారు. నేటి సాయంత్రం వరకు ఎవరు విజేత అనే ఫలితంగా తేలనుంది.

మహిళా నేతల అరెస్ట్ సబబు కాదు

ఉస్మానియా యూనివర్సిటీ: అందాల పోటీలకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన మహిళాతల అరెస్ట్ పై జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నాగేశ్వర్‌రావు, సుమంత్ శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. అందాల పోటీలను రద్దు చేయాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలను పోలీసులు అత్యుత్సహంతో బలవంతంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పీవోడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్యను అరెస్ట్ చేసిన పద్ధతి అమానుషం అన్నారు.

20న సమ్మెను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 20న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని టీయూసీఐ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ కోరారు.ప్రెస్ వద్ద సమ్మె విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని, కనీస పెన్షన్‌ను రూ.9000 చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, విజయ, సావిత్రి, శివరంజని, జయ, వెంకటేష్, పద్మ, శాంత, రాధా, నాజియా, సారయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాస నగర్‌లోని శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం సుదర్శన హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి మేళతాళాలు, బాజా భజంత్రీల మధ్య హోమం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

HAPPY MOTHER'S DAY GREETINGS ADVT. SPL.

ట్రాఫిక్ రూల్స్ తప్పని సరిగా పాటించాలి

హిమాయత్‌నగర్: రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ అన్నారు. అందుకు రహదారులపై విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. హిమాయత్‌నగర్‌లోని అటీనాస్ ఫ్రెటర్నిటీ నేషనల్ ఏవియేషన్ అకాడమీ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. యువత ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నారని, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తారని తెలిపారు. విద్యార్థులకు కలిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో బేగంపేట టీటీఐ సిబ్బంది అయాన్, కృష్ణ, అకాడమీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వాలి

వెంగళరావునగర్: కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతినెలా సకాలంలో వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్ డిమాండ్ చేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్ స్టేట్‌హోం వద్ద శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 20వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పోస్టర్ విడుదల చేసి, గోడకు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఒకవైపు ధరలు పెరిగిపోతుంటే కార్మికుల జీతాలు మాత్రం పెరగడం లేదని చెప్పారు.

తెలంగాణలో ఐఐటీ, ఐఐఎంలను ఏర్పాటు చేయాలి



మంత్రి కిషన్ రెడ్డికి వినతి పత్రం అందచేస్తున్న దయకర్

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణలో ఐఐటీ, ఐఐఎంలను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి శనివారం వినతి పత్రం సమర్పించినట్లు టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ పీహెచ్‌డీ స్కాలర్ చనగాని దయాకర్ తెలిపారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న ఐఐటీలో సీట్ల సంఖ్యను 590కి పెంచాలని, నూతన ఐఐటీ, ఐఐఎంలను నెలకొల్పే దిశగా కేంద్రం ప్రభుత్వం ఆలోచించాలని కోరినట్లు తెలిపారు.

స్టేడియంలో చిన్నారుల సందడి



లాలాపేట: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ లాలాపేటలోని ప్రొ.జయశంకర్ స్టేడియంలో ఉత్సాహంగా కొనసాగుతోంది. గత నెల 29న ప్రారంభమైన సమ్మర్ కోచింగ్ జూన్ 5 వరకు కొనసాగుతుంది. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు షటిల్ బ్యాడ్మింటన్, కరాటే, జిమ్నాస్టిక్స్, బాక్సింగ్, జిమ్ తదితర క్రీడా అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.



సైనికులకు మద్దతుగా ర్యాలీ



అమీర్‌పేట: ఇండియన్ ఆర్మీకి మద్దతుగా బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఎస్ఆర్‌నగర్ ఉమేష్ చంద్ర విగ్రహం నుంచి బల్కంపేట ఆలయం మీదుగా అమీర్‌పేట సత్యం థియేటర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సరళ, బీజేపీ సీనియర్ నాయకులు బూర్గుల శ్యామ్ సుందర్‌గౌడ్, సత్యనారాయణ, చందు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై కార్పొరేటర్ సమావేశం

హిమాయత్‌నగర్: స్థానిక సమస్యలపై హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ తన కార్యాలయంలో వివిధ బస్తీ, కాలనీవాసులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్, బోర్‌వెల్స్ ఇతర సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్‌గౌడ్, మహేష్, బస్తీ ప్రముఖులు ప్రియారాజ్ జైస్వాల్, రమేష్, శివ, నరసింహా, పూర్ణచందర్, మొషిన్, శ్రీహరి పాల్గొన్నారు.

పార్ట్‌టైమ్ జాబ్ పేరిట మోసం..

రూ.1,12,000లకు టోకరా

సనత్‌నగర్: పార్ట్‌టైమ్ జాబ్ పేరిట ఆర్థిక మోసానికి పాల్పడిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. సనత్‌నగర్‌కు చెందిన నిత్యాకు వాట్సాప్‌కు గుర్తుతెలియని వ్యక్తి నుంచి పార్ట్‌టైమ్ జాబ్ ఆఫర్ అంటూ లింక్ వచ్చింది. దీంతో ఆమె ఆ లింక్‌ను ఓపెన్ చేసి సూచనలను పాటిస్తూ కొన్ని స్క్రీన్‌షాట్లను కూడా పంపించింది. దీనికి వారు కొంత డబ్బు కూడా పంపించారు. ఆ తర్వాత టెలిగ్రామ్‌లో కనెక్ట్ అయ్యి కొంత పని ఇచ్చిన తర్వాత దానిని పూర్తి చేసింది. మరింతగా లాభం పొందాలంటే కొంత పెట్టుబడి పెట్టాలని సూచించడంతో వారి మాటలను నమ్మిన యువతి రూ.1,12,000 బదిలీ చేసింది. అంతటితో ఆగకుండా మరింతగా లాభం వచ్చేలా మరికొంత పెట్టుబడి పెట్టాలన్నారు. దీనికి ఆమె నిరాకరించింది. అప్పటి నుంచి వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. తాను మోసపోయానని గ్రహించి సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో కారు నడుపుతూ.. బైక్‌ను ఢీకొట్టి

ఒకరికి తీవ్ర గాయాలు..

సనత్‌నగర్: పీకలదాకా మద్యం తాగి కారు నడుపుతూ ముందువెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. కూకట్‌పల్లి ఎల్లమ్మబండకు చెందిన పెట్టూరు (25) ఈ నెల 8న ఉదయం తన బజాజ్ ప్లాటినం బైక్ పై సికింద్రాబాద్ వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో ఓ కారు ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టగా పెట్టూరు తీవ్రంగా గాయపడ్డాడు. కారు డ్రైవర్ నరేన్‌సాయికి డ్రంకన్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా అతనికి 550 ఎంజీగా తేలింది. బాధితుడి సోదరుడు లాజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు తెలిపిన మేరకు.. ఓల్డ్ అల్వాల్‌లోని మంగాపురం కాలనీకి చెందిన ప్రశాంత్‌కుమార్(48) కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి గుండ్ల పోచంపల్లి - బొల్లారం రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాలపై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

అమీర్‌పేట: రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధుడిని వాటర్ ట్యాంకర్ ఢీ కొనడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రి వద్ద ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీకాకుళం జిల్లా రేగిడికి చెందిన సూరయ్య (60) బీకేగూడ సంజయ్ గాంధీ నగర్‌లో భార్యతో కలిసి ఉంటున్నాడు. దినసరి కూలీగా పనిచేసే సూరయ్య తోటి కూలీలతో కలిసి శనివారం ఉదయం ఈఎస్ఐ ప్రధాన రహదారి పక్కన నడుచుకుంటూ వెళుతుండగా వేగంగా వచ్చిన ప్రైవేటు వాటర్ ట్యాంకర్ వెనుకనుంచి సూరయ్యను ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్సులో సూరయ్యను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కేసు దర్యాప్తులో ఉంది.